అధికారుల బదిలీ..

దస్తురాబాద్, జూలై 21 : మండల పంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న పీ అనిల్ కుమార్‌ను పెంబి మండలానికి బదిలీ చేస్తున్నట్లు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఎంపీవోగా నాలుగు సంవత్సరాలకు పైగా ఆయన మండలంలో పని చేశారు. అలాగే మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్‌ఈవోగా విధులు నిర్వహిస్తున్న టీ వేణు గోపాల్ జిల్లా కేంద్రంలోని డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయానికి బదిలీ అయ్యారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరు సంవత్సరాలుగా విధులు నిర్వహించారు. కాగా తమ విధులకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వారు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దస్తురాబాద్, జూలై 21 : గోదావరి తీరా ప్రాంతాలైన దేవునిగూడెం, భూత్కూర్, రాంపూర్, గొడిసేర్యాల, మున్యాల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సర్వరాజ్ నవాజ్, ఎస్ఐ శంకర్ సూచించారు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో కడెం ప్రాజెక్టులోకి భారీగా వరద రావడంతో అధికారులు గేట్లు ఎత్తి గోదావరిలోకి నీటిని వదులుతున్నాట్లు తెలిపారు. కాబట్టి మత్స్యకారులు చేపల వేటకు వెళ్ళవద్దని, పశువులను గోదావరి తీరా ప్రాంతాల వద్ద తీసుకెళ్లవద్దని పశుకాపలదారులకు సూచించారు.

గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వాలి

పెంబి, జూలై 21: పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలని అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి మల్లపల్లి స్వామి డిమాండ్ చేశారు. ఆదివారం పెంబిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీ, ఎస్సీలకు ప్రత్యేక చట్టాలు చేసి పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు వెడ్మా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

ఉట్నూర్ రూరల్, జూలై 21 : ఉట్నూర్ మండలం సాలెగూడ గ్రామానికి చెందిన ఆత్రం భీమేశ్వరి(28) పురుగుల మందు తాగి ఆత్యహత్య చేసుకుంది. ఎస్ఐ మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం ఆత్రం భీమేశ్వరి శనివారం పురుగుల మందు తాగింది. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు ఉట్నూర్ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఆదిలాబద్ రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. భర్త, కుటుంబ సభ్యులు వేధింపులకు గురి చేసినట్లు అనుమానం ఉందని మృతురాలి తండ్రి మారుతి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు సంతానం ఉన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతి

ఇచ్చోడ, జూలై 21 : మండలకేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ షేక్ మొసిన్(36) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... షేక్ మొసిన్ మండలకేంద్రంలోని ఓ ప్లాట్ అమ్మకంలో మధ్యవర్తిగా ఉన్నాడు. ప్లాట్ అమ్మిన వ్యక్తికి డబ్బులు రాకపోవడంతో పలు మార్లు పంచాయతీలు జరిగాయి. తమకు డబ్బులు కావాలని ప్లాట్ అమ్మిన వ్యక్తితోపాటు కుటుంబ సభ్యులు మొసిన్‌పై వేధింపులకు పాల్పడ్డారు. కొనుగోలు చేసిన వ్యక్తి సైతం డబ్బులు ఇవ్వకపోవడంతో మనోవేదనకు గురైన మొసిన్ ఈనెల 16వ తేదీ ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. భార్య సల్మా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

సూపర్‌స్పెషాలిటీలో వనమహోత్సవం

ఎదులాపురం, జూలై 21 : సూపర్‌స్పెషాలిటీ దవాఖాన ముందు భాగంలో ఆదివారం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్‌తో పాటు ప్రముఖ వైద్యులు సత్యనారాయణ, తిప్పా స్వామి, చంపత్ రావు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ రిమ్స్‌ను హరితవనంగా మార్చడానికి వేయ్యి మొక్కలు నాటడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. మొక్కల సంరక్షణకు అవసరమైన పెన్సింగ్ ఖర్చులు వైద్యుడు సత్యనారాయణ భరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయనను అభినందించారు.

మొక్కలు నాటి నీరు పోస్తున్న రిమ్స్ డైరెక్టర్, వైద్యులు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, జూలై 21 : ఆదిలాబాద్ జిల్లాలో ఎడతెరిపి లేకుండా రెండు, మూడు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజర్షి షా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు హెడ్‌క్వార్టర్స్‌లో ఉండి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వరదల కారణంగా నష్టాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని చెరువు కట్టలు, కుంటలు తెగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రతి ప్రాంతంపై అధికారులు నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు అత్యవరమైతే తప్పా బయటకు రావద్దని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైన హెచ్చరికలు జారీ చేయాలని , వాగులు వంకల వైపు వెళ్లకుండా ప్రజలను ఇతర మార్గాల వైపు మళ్ళించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు సమన్వయంతో లైన్ ఏరియాలను గుర్తించి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాతావరణ శాఖ అధికారులు జారీ చేసే హెచ్చరికలు పాటిస్తూ ఎప్పటికప్పుడు అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాల పరిశుభ్రత శానిటేషన్ సమస్యలు తలెత్తకుండా, తాగునీరు కలుషితం కాకుండా క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని కలెక్టర్ తెలిపారు.

ఎమ్మెల్యేకు ఉద్యోగుల వినతి

వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

ఎదులాపురం, జూలై 21 : సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నేరవేర్చేలా తన వంతు కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను ఎమ్మెల్యేకు తెలియజేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు తనకు తెలుసని, వాటి పరిష్కరం కోసం ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డితో చర్చిస్తానని హామీ ఇచ్చారు. మినిమం టైం స్కేల్, ఉద్యోగ భద్రత కల్పించేలా తన వంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేను సత్కరించి జ్ఞాపికను అందించారు. కలిసిన వారిలో యుఆర్ఎస్ ఏసు ప్రశాంత్, సీఆర్పీ దర్శన్ సోమన్న, ప్రకాశ్, రాజన్న, హిమబిందు, తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఉట్నూర్, జూలై 21: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు ధరమ్‌సింగ్ ఆదివారం ఉట్నూర్‌లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జూపటేల్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఇక్కడ ఉద్యోగులు, నాయకులు ఉన్నారు.

గంగనీళ్ల పోచమ్మ తల్లి పండుగ

దిలావర్‌పూర్, జూలై 21: న్యూ లోలం గ్రామంలో తొలిఏకదశమి తర్వాత వచ్చే మొదటి ఆదివారం ప్రతి సంవత్సరం గంగనీళ్ల, పోచమ్మ తల్లి పండుగను గ్రామస్తులందరూ కలిసి ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు గోదావరికి వెళ్లి గోదావరి నుంచి తీసుకువచ్చిన గంగనీళ్లతో గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సోన్, జూలై 21: ఈ ఏడాది పంటలు బాగా పండాలని అందరిని చల్లగా ఉంచాలని కోరుతూ నిర్మల్ మండలం తాంశా గ్రామంలో గ్రామస్తులు గంగనీళ్లతో పోచమ్మకు జలాభిషేకం చేశారు.

టీపీయూఎస్ మండల కార్యవర్గం ఎన్నిక

ఇచ్చోడ, జూలై 21 : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు సునీల్ చౌహాన్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలాధ్యక్షుడిగా బింగి రాజన్న, ప్రధాన కార్యదర్శిగా గడ్డెవార్ శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శి అఖిల్, సహ అధ్యక్షులుగా మహాదు, ఉపాధ్యక్షులుగా రాథోడ్ రమేశ్‌ను ఎన్నుకున్నారు.

ఘనంగా వర్షావాస్ కార్యక్రమం

భైంసా టౌన్, జూలై 21 : మండలంలోని బాబుగాం గ్రామంలో ఆదివారం బుద్ధిస్ట్ సోసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వర్షావాస్ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బౌద్ధాచార్యులు ప్రసంజిత్ హెమ్లే మాట్లాడుతూ ప్రపంచానికి మహాత్మ గౌతమ బుద్ధుని బోధనలు అనుసరణీయం అన్నారు. గౌతమ బుద్ధుని, అంబేద్కర్ చిత్రపటాలకు పూల మాల వేసి నివాళులర్పించారు.

మొక్కలు నాటిన విద్యుత్ అధికారులు

విద్యుత్‌శాఖ కార్యాలయంలో మొక్కలు నాటుతున్న విద్యుత్ అధికారులు

కడెం, జూలై 21: కడెం మండలకేంద్రంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఏఈ సుమన్‌కుమార్ ఆధ్వర్యంలో అధికారులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏఈ సుమన్‌కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కడెం, బెల్లాల్, లింగాపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని అధికారులు పాల్గొన్నారు.

రూ.10 వేలు ఆర్థిక సాయం

దస్తురాబాద్,జూలై 21 : మండల కేంద్రానికి చెందిన కూచనపెల్లి సురేశ్ ఇటీవల ఈదురు గాలుకు ఇంటి పైకప్పు పూర్తిగా లేచిపోవడంతో ఉండడానికి వసతి లేకుండా పోయింది. అలాగే రెండు రోజు క్రితం రోడ్డు ప్రమాదంలో సురేశ్ గాయపడ్డాడు. పని చేసుకోని పరిస్థితిలో ఉన్నాడు. విషయం తెలుసుకున్న మండల కేంద్రానికి చెందిన గాల్ఫ్ అసోసియేషన్ ఫౌండేషన్ సభ్యులు దాతల ద్వారా డబ్బులను సేకరించారు. కాగా శనివారం గాల్ఫ్ అసోసియేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ సభ్యులు ఆయన ఇంటికి వెళ్ళి సేకరించిన రూ 10 వేల రూపాయాల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గుబ్బలి రాకేశ్,బింగి శేఖర్,కూచనపెల్లి లక్ష్మి నర్సయ్య,తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ అడ్వైజర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే

భైంసా, జూలై, 21: హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అడ్వైజర్ వేం నరేంధర్ రెడ్డిని ఆదివారం మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల శాలువాతో సత్కరించారు.

ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలి

అధికారులతో మాట్లడుతున్న జాన్సన్ నాయక్

ఖానాపూర్ టౌన్, జూలై 21 : వర్షాల కారణంగా రైతులు, ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ భుక్యా జాన్సన్ నాయక్ అన్నారు. తర్లపాడ్–ఖానాపూర్ రహదారిలో నిర్మాణ దశలో ఉన్న బ్రిడ్జి వద్ద తాత్కలికంగా ఏర్పాటు చేసిన అప్రోచ్ రోడ్డు గుంతలు పడి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న జాన్సన్ నాయక్ సంఘటన స్థలానికి వేళ్లి డీఈ మల్లారెడ్డితో మాట్లడారు. ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకుని సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రజల రాకపోకలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి రాజగంగన్న, పట్టణ అధ్యక్షుడు గౌరికర్ రాజు, నాయకులు, ప్రజాప్రతినిదులు ఖలీల్,కొక్కుల ప్రదీప్, శనిగారపు శ్రావణ్, కారింగుల సుమన్, బల్గం రమేష్, షబీర్ పాషా, సుద్దాల మహిపాల్ తదితరులున్నారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ

ఖానాపూర్ మండల ంలోని రాజురా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మాలవత్ మదన్‌లాల్ కుటుంబాన్ని బీఆర్ఎస్ నియోజ కవర్గ ఇన్‌చార్జి భుక్య జాన్సన్ నాయక్ అదివారం పరా మర్శించారు. కార్యకర్త మదన్‌లాల్ కుమారుడు మహేశ్వర్ శనివారం రాత్రి అత్మహత్య చేసుకున్నాడన్న విషయం తెలసుకున్న జాన్సన్ నాయక్ రాజురా గ్రామానికి వెళ్లి బాదిత కుటంబాన్ని ఓదార్చారు. బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటామని కుటుంబాన్ని అన్ని విధాలుగా అదుకుంటామని భరోసా ఇచ్చారు.

ఆపన్న హస్తం కోసం ఎదురు చూపులు

- క్యాన్సర్‌తో బాధపడుతున్న యువకుడు
- చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు

ఓరగంటి రాములు పిల్లలతో రాములు భార్య రజిత

ఇచ్చోడ(సిరికొండ), జూలై 21 : సిరికొండకు చెందిన ఓరగంటి విజయ– విరన్న దంపతుల పెద్ద కుమారుడు రాములుది పేద కుటుంబం. రాములుకు ఐదు సంవత్సరాల క్రితం రజితతో వివాహం జరిగింది. వీరి రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి. రాములు, రజిత ఇద్దరు కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గతేడాది రాములుకు క్యాన్సర్ వ్యాధి రావడంతో వారి దాచుకున్న డబ్బుతో చికిత్స చేయించారు. అయినా నయం కాకపోవడంతో క్యాన్సర్ మరింత పెరిగింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స చేయించుకోవడానికి వెళ్లగా డబ్బుల లేకపోవడంతో చికిత్స అందక దిక్కు లేని పరిస్థితి ఉన్నామని కుటుంబీకులు వాపోతున్నారు. దాతలు ముందుకు వచ్చిన తమకు ఆర్థిక సహాయం అందించాలని కోరుతున్నారు. దాతలు ఓరగంటి ప్రవీణ్ నంబర్ 9177166416 గూగుల్ పే, ఫోన్ పే ద్వారా మానవతా దృక్పథంతో ఆర్థిక సాయం అందించాని కోరుతున్నారు.

ఆటుపోట్లకు ఆస్కారం

మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లలో గత వారం సైతం నూతన రికార్డులు నమోదయ్యాయి. అయితే వరుస లాభాలతో సూచీలు గరిష్ఠ స్థాయిల్లో కదలాడుతున్న వేళ.. మదుపరులు లాభాల స్వీకరణ దిశగా అడుగులు వేశారు. దీంతో ఓవరాల్‌గా స్వల్ప లాభాలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 85.31 పాయింట్లు పెరిగి 80,604.65 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 28.75 పాయింట్లు అందుకుని 24,530.90 దగ్గర ముగిసింది. శుక్రవారం భారీ నష్టాలు వాటిల్లకపోతే సూచీలు నయా ఆల్‌టైమ్ హైల్లోనే ఉండేవి. ఇక ఈ వారం కూడా మదుపరులు ఆయా సంస్థల త్రైమాసిక ఆర్థిక ఫలితాల ఆధారంగా తమ పెట్టుబడులపై నిర్ణయం తీసుకునే వీలున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024–25)గాను తొలి త్రైమాసికం (ఏప్రిల్–జూన్) కోసం కంపెనీలు తమ ఫైనాన్షియల్ రిజల్ట్స్‌ను ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. అయినప్పటికీ సూచీలు రికార్డుస్థాయి గరిష్ఠాల్లో ఉన్నందున పెట్టుబడులు–ఉపసంహరణల మధ్య ఇన్వెస్టర్లు కొట్టుమిట్టాడేందుకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కాగా, గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఎప్పట్లాగే ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,200 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,900 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 24,700–24,900 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.



ఆఖర్లో కాదు..

రుణ చెల్లింపుల్లో లాభం ఇలా

మనలో ప్రతి ఒక్కరూ ఎప్పుడో ఒకప్పుడు బ్యాంకుల్లో లేదా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల్లో రుణాన్ని తీసుకోవడం సహజం. అయితే ఆ రుణ భారాన్ని వీలైనంత త్వరగా తీర్చేసుకుందామనుకొని కొన్ని పొరపాట్లు చేస్తూంటారు. దీనివల్ల నష్టాల పాలవుతూంటారు. అందుకే రుణ చెల్లింపుల విషయంలో ఎప్పుడు? ఎలా? అన్నది అత్యంత ముఖ్యమైన అంశం. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల్లో లోన్లు తీసుకున్నప్పుడు.. వడ్డీతో కలిపి ఆ మొత్తాన్ని నిర్ణీత లేదా రుణగ్రహీత ఎంచుకున్న కాలవ్యవధికి సమాన ఈఎంఐలుగా పంచుతారు. అయితే ఈ నెలవారీ వాయిదాల్లో మొదట చెల్లిస్తూపోయే వాటిలో ఎక్కువ మొత్తం రుణంపై రుణదాతలు వసూలుచేసే వడ్డీనే ఉంటుం ది. కాలం గడుస్తున్నకొద్దీ చివర్లో ఉండే ఈఎంఐల్లో వడ్డీకన్నా అసలే ఉంటుంది. అంటే.. రుణం తీసుకున్న తొలినాళ్లలో చెల్లించే ఈఎంఐల్లో ఎక్కువ మొత్తం వడ్డీ కిందనే పోతుంది. అసలు రుణంలో మైనస్ అయ్యేది చాలా తక్కువ. అలాగే ఆఖర్లో చెల్లించే ఈఎంఐల్లో వడ్డీ కన్నా అసలు రుణమే ఎక్కువగా ఉంటుంది. కాబట్టి రుణ భారం తగ్గించుకోవాలనుకునేవారు మొదట్లోనే వీలైనంత చెల్లించడం మంచిది. ఆఖర్లో ఒకేసారి చెల్లించడం కన్నా ఈఎంఐలను అనుసరించడమే లాభదాయకం.



లోన్ పోర్టబులిటీ

రుణాలపై వివిధ బ్యాంకులు, సంస్థలు రకరకాల వడ్డీరేట్లను అనుసరిస్తూంటాయి. రుణగ్రహీత సిబిల్ స్కోర్‌తోపాటు మరికొన్ని అంశాలు ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తాయి. అయితే మనం తీసుకున్న రుణంపై వడ్డీరేటు ఎక్కువగా ఉందనుకుంటే.. ఎందులో తక్కువగా ఉందో తెలుసుకుని ఆ మొత్తం రుణాన్ని అక్కడికి మార్చుకోవడం ఉత్తమం. దీన్నే లోన్ పోర్టబులిటీ అం టారు. దీనివల్ల వడ్డీ భారం తగ్గుతుంది. కానీ ఈ ప్రక్రియకు కొన్ని చార్జీలు వర్తిస్తాయి. వీటన్నిటినీ కలిపి లెక్కించే రుణాన్ని ఒక సంస్థ నుంచి మరో సంస్థకు మార్చుకోవడం లాభమా? నష్టమా? అన్నది తేల్చుకోవాలి. లేకపోతే భారం మరింత పెరిగే ప్రమాదం ఉన్నది.

ఐటీఆర్‌లో సెక్షన్‌తో కొడదాం

ఇది ఆదాయ పన్ను రిటర్ను (ఐటీఆర్)ల కాలం. 2023-24 ఆర్థిక సంవత్సరానికి (2024-25 మదింపు సంవత్సరం) గాను ఈ నెలాఖర్లోగా (జూలై 31) ఐటీఆర్‌ను దాఖలు చేయాల్సి ఉంటుంది. దీంతో పన్ను ఆదా కోసం ఉన్న మార్గాలను అంతా వెతుకుతున్నారు. అయితే అందరికీ తెలిసింది సెక్షన్ 80సీ మాత్రమే. కానీ ఐటీ చట్టంలోని వివిధ సెక్షన్ల కింద రకరకాల పెట్టుబడులు, ఖర్చులు, రుణాల చెల్లింపులు, వడ్డీ ఆదాయాలపై పన్ను మినహాయింపును పొందవచ్చు. వాటిని పరిశీలిస్తే..

1. నేషనల్ పెన్షన్ సిస్టమ్

నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లో పెట్టుబడులకు సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షలదాకా పన్నును ఆదా చేసుకోవచ్చు. ఇక సెక్షన్ 80సీసీడీ (1బీ) కింద అదనంగా మరో రూ.50,000 ఆదా చేయవచ్చు. మొత్తంగా రూ.2 లక్షలు ఆదా అవుతాయి.

2. ఆరోగ్య బీమా

సెక్షన్ 80డీ కింద ఆరోగ్య బీమా ప్రీమియంను క్లెయిం చేసుకోవచ్చు. ఎంత? అన్నది పాలసీ కవరేజీ, వయసుపై ఆధారపడి ఉంటుంది. ఇలా రూ.25,000, రూ.50,000, లక్ష రూపాయల వరకు పన్ను ఆదా చేసుకోవచ్చు.

3. విద్యా రుణం

పిల్లల విద్య కోసం రుణం తీసుకున్నట్టయితే.. దాని చెల్లింపులపైనా పన్ను మినహాయింపును క్లెయిం చేసుకోవచ్చు. సెక్షన్ 80ఈ కింద విద్యా రుణంలోని వడ్డీ భాగంపై పన్ను మినహాయింపును పరిమితి అనేదే లేకుండా పొందవచ్చు. రుణాన్ని చెల్లించేది తల్లిదండ్రులా.. పిల్లలా.. అన్న తేడా లేకుండా ఈ ప్రయోజనాన్ని అందుకోవచ్చు.

4. హోమ్ లోన్ వడ్డీ

గృహ రుణ చెల్లింపులపై రెండు మార్గాల్లో పన్ను మినహాయింపును క్లెయిం చేసుకోవచ్చు. ఒకటి సెక్షన్ 80సీ కింద అసలుపై రూ.1.5 లక్షల వరకు పన్ను ఆదా చేసుకోవచ్చు. మరొకటి సెక్షన్ 24 కింద వడ్డీ భాగంపై రూ.2 లక్షలదాకా పన్ను ఆదా కోరవచ్చు. కొన్న ఇంట్లో మీరున్నా.. లేదా దానిపై అద్దె ఆదాయం పొందుతున్నా.. పన్ను మినహాయింపులను అందుకోవచ్చు.



5. తొలిసారి ఇంటి కొనుగోలుపై

తొలిసారి ఇంటిని కొనుగోలుచేసేవారికి సెక్షన్ 80ఈఈ కింద గృహ రుణ వడ్డీపై కేంద్ర ప్రభుత్వం అదనపు పన్ను ప్రయోజనాలను కల్పిస్తున్నది. ఈ సెక్షన్‌లో రూ.50,000 వరకు ఎక్స్‌ట్రా ట్యాక్స్ క్లెయిములు చేయవచ్చు. సెక్షన్ 24 కింద వర్తించే మినహాయింపులకు అదనం. దీంతో రూ.2.5 లక్షల వరకు ప్రయోజనం ఉంటుంది. అయితే మీ పేరిట అంతకుముందు ఏ ఇల్లూ ఉండరాదు. అలాగే కొనే ఇంటి విలువ రూ.50 లక్షలు మించరాదు. తీసుకునే అప్పు కూడా రూ.35 లక్షలు దాటరాదు.

6. హెచ్ఆర్ఏ

ఉద్యోగులకు వారి సంస్థ యాజమాన్యాలు హౌజ్ రెంట్ అలవెన్స్ (హెచ్ఆర్ఏ)ను ఇస్తే.. అద్దెపై పన్ను మినహాయింపును పొందవచ్చు. సెక్షన్ 80జీజీ కింద ఈ అవకాశం ఉంటుంది.

7. ఎస్‌బీ అకౌంట్ వడ్డీ

సేవింగ్స్ బ్యాంక్ (ఎస్‌బీ) అకౌంట్ నుంచి అందుకునే వడ్డీ ఆదాయంపైనా పన్ను మినహాయింపును కోరవచ్చు. వడ్డీ ఆదాయం రూ.10,000 వరకుంటే సెక్షన్ 80టీటీఏ కింద ఎవరైనా వ్యక్తి లేదా హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) ఐటీ ప్రయోజనాన్ని పొందవచ్చు.

8. దివ్యాంగుల కేర్ టేకర్‌గా..

మీరు దివ్యాంగుల బాగోగులు చూసుకుంటున్నట్టైతే సెక్షన్ 80డీడీ కింద వారి ఖర్చులపై పన్ను మినహాయింపులను కోరవచ్చు. అంగ వైకల్యాన్నిబట్టి మినహాయింపు ఎంత? అన్నది తెలుస్తుంది. రూ.75,000–రూ.1.25 లక్షల మేర ఉంటుంది.

9. వైద్య ఖర్చులకు..

క్యాన్సర్, నరాల వ్యాధులు, ఎయిడ్స్ వంటి రోగాల వైద్య ఖర్చులపైనా ఐటీ మినహాయింపును తీసుకోవచ్చు. సెక్షన్ 80డీడీబీ కింద రూ.40,000 వరకు పన్ను తగ్గింపును పొందవచ్చు. సీనియర్ సిటిజన్లకైతే లక్ష రూపాయలదాకా ప్రయోజనం ఉంటుంది.

10. విరాళాలు

విరాళాలపై సెక్షన్ 80జీ కింద పన్ను మినహాయింపును క్లెయిం చేయవచ్చు. అయితే మొత్తం డొనేషన్‌పై ప్రయోజనం రాదు. అలాగే గుర్తింపు పొందిన ఛారిటబుల్ సంస్థకు విరాళం ఇస్తేనే ఈ సౌకర్యం ఉంటుంది.

పన్ను వర్తించే శ్లాబులో మీ ఆదాయం ఉన్నట్టైతే.. ప్రతీ ఆర్థిక సంవత్సరం ఐటీఆర్‌ను తప్పక దాఖలు చేయాల్సిందే. అయితే ఆదాయ పన్ను పరిధిలో మనం లేముకదా.. అని చాలా మంది ఐటీఆర్‌ను లైట్ తీసుకుంటారు. కానీ ఐటీ పరిధిలోకి రాకున్నా.. ఏటా నిల్ ఐటీఆర్‌ను దాఖలు చేస్తే పలు ప్రయోజనాలున్నాయి. 60 ఏండ్లలోపున్నవారికి పాత పన్ను విధానంలోనైతే రూ.2.5 లక్షలు, కొత్త పన్ను విధానంలోనైతే రూ.3 లక్షలదాకా వార్షిక ఆదా యం ఉన్నా పన్నులు చెల్లించనక్కర్లేదు. ఇక నిల్ ఐటీఆర్‌ను దాఖలు చేస్తే వీసా దరఖాస్తుల కోసం ప్రధాన ఆదాయ ధ్రువీకరణగా ఉంటుంది. అలాగే రుణాలను తీసుకునేటప్పుడు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ట్యాక్స్ రిఫండ్స్‌కూ దోహదపడుతుంది.